క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట, మచిలీబజార్ సబ్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 7.30గంటల నుంచి 9 గంటల వరకు, న్యూశాయంపేట, పెద్దమ్మగడ్డ, ఆర్ఈసీ, సోమిడీ, వడ్డపల్లి, టెక్స్‌టైల్ పార్కు, రాంపూర్ సబ్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అదే విధంగా కాజీపేటలోని బాపూజీ నగర్, శాంతినగర్, కాజీపేట మెయిన్ రోడ్, అమీర్ హోటల్, అంబేడ్కర్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంజీఎంకు మైక్ సెట్ వితరణ



ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రిలోని ఓపీ విభాగంలో రోగులకు తగు సూచనలు అందించేందుకు వీలుగా రూ.14 వేల విలువల మైక్‌సెట్‌ను దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిల్ల మహేందర్, రాష్ట్ర కార్యదర్శి నున్న నర్సమ్మ ఆధ్వర్యంలో ఎంజీఎం అధికారులకు నాయకులు శుక్రవారం బహూకరించారు. ఈ మైక్‌సెట్‌ను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలక మురళి, ఆర్ఎంఓ కోడం మురళి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంజీఎం ఉద్యోగులు బొప్పి ఉమారాణి, బి.సునీత, స్వర్ణలత, రవీందర్, వాణి రాజేశ్వరి, రేణుక, వివిధ సంఘాల నాయకులు బత్తిని రాజు, రాజేందర్, బండి చక్రపాణి, షబీర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి




కాజీపేట: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్‌లోని మంత్రుల క్వార్టర్స్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రిని సభ్యులు కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో పోతుల మల్లేశం, నందికంటి సాయికుమార్, పోతుల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'క్వాడ్రాంట్'లో ఇంటర్వ్యూలు



మడికొండ: మడికొండలోని క్వాడ్రాంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాల కోసం శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 500 మంది అభ్యర్థులు హాజరుకాగా వారిలో 60మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంటర్వ్యూలో హెచ్‌ఆర్ దీపక్, క్వాడ్రాంట్ డైరెక్టర్ కంచరకుంట్ల మురళీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదానం



కాజీపేట అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని బాలసముద్రం కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు, హరి బిల్డర్స్ కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ నామిరెడ్డి సీతారాంరెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం గణపతి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హమేంద్రాదేవి, హరీశ్‌రెడ్డి, శ్వేత, ఆద్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ



కాశిబుగ్గ: 18వ డివిజన్ లేబర్‌కాలనీలోని క్రిస్టియన్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ హుజూరాబాద్ సభ్యులు శుక్రవారం స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యుడు గంగిశెట్టి దయాకర్ జ్ఞాపకార్థం అతని తమ్ముడు గంగిశెట్టి జగదీశ్వర్ రూ.25 వేల విలువ గల ప్లేట్లను విద్యార్థులకు అందజేశారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పద్మలత, ఉపాధ్యాయులు సుధాబిందు, రమాదేవి, దేవరాజు, రాములు, కల్యాణ్, శ్రీనివాస్, కృష్ణకుమార్, సంపత్, యాస్మిన్, సంతోష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ మాసం



మడికొండ: రాంపూర్ అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలతో సీడీపీఓ విశ్వజ, తదితరులు



కాజీపేట: ఆటాపాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయశ్రీ



ఖిలా వరంగల్: గర్భిణికి సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు

మడికొండ: నగర వ్యాప్తంగా అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. మడికొండ సెక్టార్‌లోని 46వ డివిజన్ రాంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పిల్లలతో ఆటలు ఆడించి, పాటలు పాడించారు. అనంతరం సీడీపీఓ విశ్వజ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిత, ఏఎన్ఎం సంధ్యారాణి, సంగీత, అంగన్‌వాడీ టీచర్లు శారద, జ్యోతి, మంజుల, సంధ్యారాణి, స్వరూప, రజిత, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

63వ డివిజన్ విష్ణుపురి కాలనీలో..

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు శుక్రవారం ఆట, పాట కార్యక్రమాన్ని కార్పొరేటర్ విజయశ్రీ ప్రారంభించారు. ప్రీస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, జి.తేరజ, శోభారాణి, గీతకుమారితో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

39వ డివిజన్ శాకరాశికుంటలో..

ఖిలా వరంగల్: ఆటపాటలు, కథలతోనే పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. పోషణ మాసోత్సవం సందర్భంగా వరంగల్ 39వ డివిజన్ శాకరాశికుంటలో అంగన్‌వాడీ టీచర్ సుభాషిణి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

దోణగుట్ట ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయం వద్ద ఎమ్మెల్యే నాయిని, నాయకులు

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ న్యూశాయంపేటలోని దోణగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. న్యూశాయంపేటలోని దోణగుట్టలోని త్రివేదాద్రి సంతోష లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో నిత్య పూజలు నిర్వహించాలని సూచించారు. కార్పొరేటర్ మామిండ్ల రాజు పాల్గొన్నారు.

నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణంపై హర్షం

హన్మకొండ చౌరస్తా: ఎమ్మెల్యేగా గెలిచిన 9 నెలల వ్యవధిలోనే నయీంనగర్ నాలాపై బ్రిడ్జి నిర్మించడంపై హనుమకొండ చౌరస్తాలోని సీపీ రెడ్డి కాంప్లెక్స్ వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీపీరెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో చవాన్ వేణు ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి పూలతో శుక్రవారం అభిషేకం చేశారు. కార్యక్రమంలో సీపీరెడ్డి కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షుడు తంగళ్లపెల్లి గిరిధర్, బట్టల వ్యాపారుల సంఘం బాధ్యుడు జమంజోతి రాజు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె లింగమూర్తి, టైలర్స్ అసోసియేషన్ బాధ్యుడు కటకం ఓంకార్, ఆదిత్య మూర్తి, లక్కం రాజు, వ్యాపార సముదాయాల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డీఏఓతో ఫోన్ ఇన్



ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రైతులు తమ సందేహాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అనురాధను నేరుగా అడిగి తెలుసుకోవచ్చు.

తేది : 14-09-2024 (శనివారం)
వరంగల్ జిల్లా రైతులు ఫోన్ చేయాల్సిన నంబర్: 72888 94705
సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

బాధిత మహిళలకు అండగా 'సఖి'



సదస్సులో మాట్లాడుతున్న హైమావతి

హన్మకొండ: బాధిత మహిళలు, బాలికలకు అండగా నిలిచే సఖి కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సఖి కేంద్రం అడ్మిన్ పి.హైమావతి సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని కాకతీయ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విడిపోయే భార్యాభర్తలను కౌన్సెలింగ్ ద్వారా ఒకటిగా కలపడం, వరకట్న వేధింపులు, లైంగిక, ఇతర వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికలకు రక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. ఉచితంగా కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు చెప్పారు. బాధితులు తక్షణ రక్షణకు 0870 – 2452112, 181 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. కేసు వర్కర్ హరిత, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

24న గ్రేటర్ కౌన్సిల్ సమావేశం

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కౌన్సిల్ సమావేశాన్ని ఈనెల 24న నిర్వహించనున్నారు. ఈమేరకు శుక్రవారం కౌన్సిల్ ఎజెండాలో ప్రవేశపట్టనున్న అంశాలపై నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వింగ్ అధికారులు చర్చించారు. కౌన్సిల్‌లో ప్రవేశపెట్టే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నిధులు లేమితో కొన్ని అభివృద్ధి పనులపై ఏమేరకు పరిగణనలోకి తీసుకోవాలని చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

అలరించిన అష్టావధానం



హన్మకొండ: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ నక్కలగుట్టలోని స్వర్ణ విహార్ అపార్టుమెంట్‌లో గురువారం రాత్రి అష్టావధానం జరిగింది. ప్రముఖ కవి డాక్టర్ ఎస్‌వీఎస్ చారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చేపూరి రామారావు పాల్గొని అష్టావధానం చేశారు. రచయిత కరాదుల అరుణ పతాక కీర్తిరెడ్డి, అక్కెర సదానందచారి, జీడికంటి శ్రీనివాసమూర్తి, కాసర్ల కవిత, గూల్ల వెంకటయ్య, కాసర్ల రంగారావు అష్టావధానంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో గుంటి విష్ణుమూర్తి, అపార్టుమెంట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, జలంధర్ రెడ్డి, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పోస్ట్‌మెట్రిక్, కళాశాల హాస్టళ్లు, బెస్ట్ అవైలబుల్ స్కీంలకు సంబంధించిన నిధులను ఆర్థికశాఖ నుంచి వెంటనే విడుదల చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా నిధులు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినయ్, ప్రశాంత్, శ్రీకాంత్, ప్రసాద్, రఘు, శ్రీధర్, మురళి, మోహన్‌బాబు, ఆకాష్, వంశీ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ చేరాలు

హసన్‌పర్తి: కొత్తగా రూపొందించిన చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు సూచించారు. హసన్‌పర్తి మండలంలోని మహాత్మాజ్యోతిరావు పూలే పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డయల్ 100, సైబర్‌నేరాలు, సోషల్ మీడియా వల్ల ఉపయోగాలు – నష్టాలు, బాల్య వివాహాలతో కలిగే కష్టాలు, ఆత్మహత్యలు, సీసీ కెమెరాల ఏర్పాటుతో వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్సై దేవేందర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

16న మిలాద్ - ఉన్ - నబీ

ఖిలా వరంగల్: ఈనెల 16న వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ఖమల్ పాషా హవేలీ గడి ప్రాంగణంలో నిర్వహించనున్న మిలాద్ – ఉన్ – నబీ వేడుకలను విజయవంతం చేయాలని ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ ఏహియా పాషా ఖాద్రీ (సోయాబ్‌బాబా) పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా వేడుకల వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ అఫ్రోజ్‌కు బంగారు పతకం



బంగారు పతకంతో అఫ్రోజ్

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్‌సీసీ కేడెట్ ఎండీ.అఫ్రోజ్ జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించాడు. న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంపు -24 డిజి ఎన్‌సీసీ పరేడ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అఫ్రోజ్ మ్యాప్ రీడింగ్ ఈవెంట్‌లో పాల్గొని బంగారు పతకం అందుకున్నాడు. ఎన్‌సీసీ 1వ బెటాలియన్ వరంగల్ తరఫున సైనిక్ క్యాంపులో అఫ్రోజ్‌ను తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేలు, డాక్టర్ విజయలక్ష్మి, మహేందర్ రెడ్డి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏసోబు కుటుంబానికి పరామర్శ

మడికొండ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీసుల ఎదురు కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు కుటుంబ సభ్యులను వరంగల్ పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల, తదితరులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఏసోబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

వరంగల్ జెడ్పీ డిప్యూటీ సీఈఓగా వసుమతి



వసుమతిని సన్మానిస్తున్న అధికారులు

వరంగల్: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా నూతి వసుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ సీఈఓ పవన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వసుమతి బదిలీపై వచ్చారు. బదిలీపై వెళ్తున్న పవన్, బాధ్యతలు స్వీకరించిన వసుమతిని ఎంపీడీఓలు శాలువాలతో సన్మానించి పూలమొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన జెడ్పీ డిప్యూటీ సీఈఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీఓల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అందరు కష్టపడి పనిచేసి జిల్లాను ఉన్నత స్థాయిలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో పరకాల, ఆత్మకూరు, శాయంపేట, నడికూడ ఎంపీడీఓలు పెద్ది ఆంజనేయులు, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫణిచంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బైబిల్ ఆధారిత వీడియో



హన్మకొండ చౌరస్తా: 'మనకు మంచి వార్త ఎందుకు అవసరం' అనే అంశంపై ప్రదర్శించిన బైబిల్ ఆధారిత వీడియో డ్రామా ప్రేక్షకులను అలరించింది. హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని ఏఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో యెహోవా సాక్షుల 'మంచివార్త ప్రకటించండి' సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బైబిల్ వీడియో ప్రదర్శన అనంతరం చర్చా గోష్టిలో ఏసు జీవించిన ప్రాంతంలోని పరిసరాలు, జంతువులు, సమాజం, చదువులు ఇతరత్రా వాస్తవాలను వివరించారు. ఈ సందర్భంగా యెహోవా సాక్షుల స్థానిక ప్రతినిధి జి.సజయ్.. మాట్లాడుతూ ఈనెల 14, 15వ తేదీల్లో 'మంచివార్తతో చెడ్డవార్తను తిప్పికొట్టడం ఎలా అనే అంశంపై నిర్వహించే ప్రదర్శనకు అందరూ ఆహ్వానితులే అని సజయ్ పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ



మందులు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్ఓ

దేశాయిపేట: ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించి, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ అన్నారు. పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదైన డెంగీ వ్యాధిగ్రస్తుడి ఇంటిని శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామంలో దోమల నివారణకు చేపట్టిన పనులను పరిశీలించారు. శివాలయం దగ్గర ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వైద్య సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయకుండా, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.మోహన్‌సింగ్, డాక్టర్ మౌనిక, ఇన్‌చార్జ్ ఏఎంఓ మాడిశెట్టి శ్రీనివాస్, హెచ్ఈఓ ఖాసీం, హెల్త్ సూపర్‌వైజర్లు ఖలీం, శ్రీనివాస్, సదానందం, వైద్య సిబ్బంది సాగర్, షఫీ, యశోద, రాధిక, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

హసన్‌పర్తి: నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ చల్లా ప్రసాద్ సూచించారు. హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయంలో నిమజ్జన ఏర్పాట్లపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిమజ్జనం జరిగే ప్రాంతంలో ఇరువైపులా బారికేడ్లు, లైటింగ్ సిస్టమ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా డీజేలు నిషేధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎంపీఓ కర్ణాకర్ రెడ్డి, ఎస్సైలు దేవేందర్, రవి, సిద్దయ్య, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

వరంగల్: వరంగల్ జిల్లా పరిధిలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గైర్హాజర్ అయిన ఉపాధ్యాయులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల విద్యాశాఖాధికారికి ఆదేశాలు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. నెక్కొండ మండల విద్యా వనరుల కేంద్రం సందర్శించగా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన నివేదికలు పరిశీలించి విద్యార్థులు పాఠశాలకు రాకున్నా నెలవారీగా పిల్లలందరూ హాజరైనట్లుగా నెలల వారీగా బిల్లులు సమర్పించినట్లు గుర్తించినట్లు తెలిపారు.

హిందీ భాషకు గొప్ప వారసత్వం ఉంది



మాట్లాడుతున్న సంజీవ

కేయూ క్యాంపస్: సాంస్కృతికంగా హిందీ భాషకు గొప్ప వారసత్వం ఉందని కాకతీయ యూనివర్సిటీ హిందీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సంజీవ అన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన హిందీ భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అధికార భాష, విభిన్న భాషల నేపథ్యం కలిగిన వ్యక్తుల మధ్య కమ్యూనికేషన్ విధానం పెంపొందించేందుకు సాధారణ సాధనంగా హిందీ ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ హిందీ ప్రభుత్వ సమాచార ప్రసారాలు, పార్లమెంటరీ కార్యకలాపాలు, అధికారిక పత్రాల్లో ఉపయోగపడుతుందని చెప్పారు. ఆర్ట్స్ కళాశాల హిందీ విభాగం అధిపతి డాక్టర్ రమాదేవి, అధ్యాపకులు అంజన్‌రావు, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ హరికుమార్, డాక్టర్ చందర్, డాక్టర్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



హసన్‌పర్తిలో పోలీసుల అదుపులో నాయకులు

హన్మకొండ: కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీల పరస్పర మాటల యుద్ధం నేపథ్యంలో మర్రియాదవ రెడ్డిని పోలీసులు శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వదిలిపెట్టారు.

మడికొండ: ఎస్‌హెచ్ఓ పులాల కిషన్ ఆధ్వర్యంలో మడికొండ పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, కార్యకర్తలు సారయ్య, బాబు, ఈదురు అనిల్, బొల్లికొండ రవీందర్, రొయ్యల లక్ష్మణ్‌కుమార్, ముప్పిడి శివ, తూర్పాటి అబ్బసాయిలు, గోపనబోయిన రాజు, వస్కుల దేవేందర్, రాసమల్ల వెంకటస్వామి, పల్లపు రాజ్‌కుమార్, తండా శంకర్, బత్తిని కిరణ్, పొన్నం శివ, జిట్ట అనిల్, పరవస్తు రఘుబాబు, రాజు, సుధాకర్ ఉన్నారు.

రామన్నపేట: పశ్చిమ నియోజకవర్గంలోని 11, 29వ డివిజన్లలోని నాయకులను మట్టెవాడ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు ఎండీ షఫీ, కొడకండ్ల సదాంత్, తాళ్లపల్లి రమేష్‌గౌడ్, వివేక్, సీతారాంనాయక్, కిరణ్, జావిద్, విక్రాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, నాయకులు విజయ్, వనం కుమార్, గజ్జి సాంబయ్య, పోలెపాక మల్లేశంను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

హసన్‌పర్తి: బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, నరెడ్ల శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, అటికం రవీందర్, విక్టర్ బాబు, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ లక్ష్మణ్, యూత్ అధ్యక్షుడు సాయి, బోడ యుగంధర్, రాజేందర్‌ను హసన్‌పర్తి, కేయూసీ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తులపై వారిని విడుదల చేశారు.

సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు



వరంగల్ లీగల్: నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

కేయూ క్యాంపస్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కార్మికవర్గ పేదలకు, సీపీఎం పార్టీకి తీరని లోటని కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని బయో టెక్నాలజీ విభాగం వద్ద ఏచూరి చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బయో టెక్నాలజీ విభాగం అధిపతి డాక్టర్ శాస్త్రి, జర్నలిజం విభాగం హెడ్ డాక్టర్ సంగని మల్లేశ్వర్, సీఐటీయూ నాయకులు మెట్టు రవి, కచ్చకాయల చిరంజీవి, బాధ్యులు రవి, రంజిత్, చేరాలు పాల్గొన్నారు.

వరంగల్ లీగల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టులోని అంబేడ్కర్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్.రమేష్, బార్ అసోసియేషర్ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ నబీ, న్యాయవాదులు గంజి గణేష్, కొత్తపెల్లి చిరంజీవి, సయ్యద్ వలీఉల్లాఖాద్రీ, షేక్ రఫీ, సిరిమల్ల అరుణ, విక్రమ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట: సీపీఎం నేత ఏచూరి సీతారాం సంతాప సభను కాజీపేట 61వ డివిజన్ మదర్ థెరిస్సా సెంటర్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చుక్కయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.